


నేటి దినపత్రిక

# సూర్య


www.suryaa.com

EVENING EDITION

పేజీలు: 02

PM

www.suryaa.com







# పెరుగుతున్న పోలింగ్.. మధ్యాహ్నం 3 గంటలకు 51.89% నమోదు

ఓటు వేయడానికి ఇంకా 90 నిమిషాలే.. వెళ్లి ఓటు వేయండి..

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ కొనసాగుతోంది. పెద్ద సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకుంటున్నారు. పోలింగ్‌కు మరో రెండు గంటలకే సమయం ఉండటంతో సామాన్యుల తోపాటు సెలబ్రిటీలు కూడా పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ కట్టారు. దీంతో పోలింగ్ శాతం క్రమంగా పెరుగుతోంది. మధ్యాహ్నం 3 గంటల సమయానికి రాష్ట్ర వ్యాప్తంగా 51.89 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. అత్యధికంగా మెదక్ జిల్లాలో 69.33 శాతం పోలింగ్ నమోదుకాగా.. అత్యల్పంగా హైదరాబాద్‌లో 31.17 శాతం పోలింగ్ నమోదైంది.







## తొలిసారి ఓటు వేస్తున్న యువత

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. గురువారం (నవంబర్ 30) ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్.. సాయంత్రం 5 గంటల వరకూ కొనసాగనుంది. దీంతో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. యువత, వృద్ధులు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివస్తున్నారు. ఈసారి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 17 లక్షల మంది కొత్తగా ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. వారిలో హైదరాబాద్ మహానగరంలోనే 8 లక్షల మంది కొత్తగా ఓటరు జాబితాల్లోకి ఎక్కారు.వీరంతా ఈ అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జగద్గిరిగుట్ట పరిధిలో కూడా వందల సంఖ్యలో కొత్త ఓటర్లు తొలి ఓట్లు వేశారు. విజ్ఞాన వర్ధిని పోలింగ్ కేంద్రంలో ఒకే కుటుంబానికి చెందిన తోట అక్షయ్ కుమార్, తోట భరత్‌కుమార్, గర్దాసు పూజిత తొలిసారిగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ కొత్త ఓటర్లు తొలిసారి ఓటు వేస్తున్నారు.



## ఆక్సిజన్ సిలిండర్‌తో పోలింగ్ కేంద్రానికి.. అందరికీ వీళ్లు ఆదర్శం


తెలంగాణ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. యువత, మహిళలతో పాటు వృద్ధులు ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న రోగులు సైతం పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలికి చెందిన 75 ఏళ్ల శేషయ్య తీవ్రమైన లివర్ సిరోసిస్‌తో బాధపడుతున్నారు. ఆక్సిజన్ సిలిండర్‌తో ఆయన పోలింగ్ కేంద్రానికి వచ్చారు. గచ్చిబౌలిలోని జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని పోలింగ్ కేంద్రంలో శేషయ్య తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు వేయడం పౌరుడిగా తన బాధ్యతని చెప్పారు. 1966 నుంచి తాను మిస్ అవ్వకుండా ఓటు వేస్తున్నానని తెలిపారు. మరోవైపు ముషీరాబాద్ గాంధీనగర్‌లోని ఎస్బీఐ కాలనీకి చెందిన ఆస్తమా రోగి లక్ష్మీ శ్యాంసుందర్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఘంటసాల గ్రౌండ్‌లోని 83వ నంబర్ పోలింగ్ కేంద్రంలో ఆమె ఓటు వేసి అందరికీ స్ఫూర్తిగా నిలిచారు.

## ఎమ్మెల్సీ కవితపై ఈసీకి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్




బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై ఈసీకి ఫిర్యాదు చేసింది కాంగ్రెస్. కవిత ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లుగా రాష్ట్ర కాంగ్రెస్ ఎన్నికల కమిటీ ఛైర్మన్ నిరంజన్ తెలిపారు.బంజారాహిల్స్‌లోని నందినగర్ డీఏవీ స్కూల్ పోలింగ్ స్టేషన్‌లో కవిత ఓటుహక్కు వినియోగించుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కు ఓటేయాలని పిలుపునిచ్చారు. అయితే ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘించినట్లే అవుతుందంటూ కాంగ్రెస్ ఆరోపిస్తూ ఈసీకి ఫిర్యాదు చేసింది. ఎమ్మెల్సీ కవితపై చర్యలు తీసుకోవాలని సీఈవో వికాస్‌రాజ్ ను కోరినట్లు నిరంజన్ తెలిపారు.

## సతీసమేతంగా సిద్దిపేటలో ఓటేసిన మంత్రి హరీశ్‌రావు



మంత్రి హరీశ్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి సిద్దిపేటలో ఓటు వేశారు. భార్య శ్రీనిత, తనయుడు అర్చిస్ మాన్‌తో కలిసి వచ్చిన మంత్రి ఓటు వేసి.. ప్రజలంతా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. మరోవైపు ఉదయం 11 గంటల వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 20.64 శాతం మేర పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లాలో 30.65 శాతం పోలింగ్ నమోదుకాగా.. అత్యల్పంగా హైదరాబాద్‌లో 12.39 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు.

## అర్బన్ ఏరియాల్లో నెమ్మదిగా పోలింగ్: సీఈవో వికాస్‌రాజ్




కొన్నిచోట్ల స్వల్ప ఘటనలు మినహా తెలంగాణ వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) వికాస్‌రాజ్ తెలిపారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత, కామారెడ్డిలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సోదరుడిపై ఫిర్యాదులు వచ్చాయని.. వాటిపై జిల్లా ఎన్నికల అధికారులు విచారణ చేపడతారన్నారు.



## ఎలక్షన్ ఎఫెక్ట్.. జనాల్లేక బోసిపోయిన మెట్రో

నేడు రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల జరుగుతుండడంతో పండుగా వాతావరణం నెలకొంది. నగర వాసులంతా ఓట్లేసేందుకు తమ తమ సొంత గ్రామాలకు పెద్ద ఎత్తున్న తరలి వెళ్లారు. గ్రామగ్రామాన పోలింగ్ ప్రక్రియ పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది. చిన్నా, పెద్దా అన్న తేడా లేకుండా అందరూ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ప్రజలంతా ఓటేయడానికి గ్రామాలకు తరలి పోవడంతో హైదరాబాద్ మహానగరం బోసిపోయింది. ముఖ్యంగా రోజూ కిక్కిరిసిపోయే హైదరాబాద్ మెట్రోలో అనూహ్య పరిస్థితి నెలకొంది. నేడు ప్రయాణిస్తున్న మెట్రో ట్రైన్లు కరోనా కాలం నాటి పరిస్థితులను తలపిస్తున్నాయి. దీనికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాగా, 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 35,655 పోలింగ్ కేంద్రాల్లో సుమారు 3.26 కోట్ల మంది ఓటర్లు నేడు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు నేడు దాదాపు లక్ష మంది రాష్ట్ర పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు.

## అదంతా కేసీఆర్ ఎన్నికల స్టంట్.. రేవంత్, బండి రియాక్షన్

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఈరోజు తెల్లవారుజామున నాగార్జునసాగర్ వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. సాగర్ డ్యామ్‌పైకి ఏపీ పోలీసులను, ఏపీ ఇరిగేషన్ అధికారులను వెళ్లకుండా తెలంగాణ పోలీసులు గేటు వేసి అడ్డుకున్నారు. గేటు తీయమని శాంతియుతంగా ఎంత చెప్పినా తెలంగాణ పోలీసులు వినలేదు. పోలీసుల సహకారంతో సాగర్ డ్యామ్‌పై ఏపీ సరిహద్దుల్లో తమ పరిధిలో ఇరిగేషన్ అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. నాగార్జునసాగర్ ఘటనపై రేవంత్ స్పందిస్తూ.. 'ఎన్నికలు వచ్చినప్పుడల్లా తెలంగాణ సెంటిమెంట్‌ను ఉపయోగించుకుని రాజకీయ లబ్ధి కోసం కేసీఆర్ పన్నాగాలు పన్నుతున్నారు. పోలింగ్‌కు ముందురోజు సెంటిమెంట్‌ను రగిల్చేందుకు యత్నించారు' అని విమర్శించారు. ఎన్నికల్లో ఓటు




వేసిన అనంతరం బండి సంజయ్ నాగార్జున సాగర్ ఘటనపై స్పందించారు. ఈ క్రమంలో బండి సంజయ్ మాట్లాడుతూ.. 'టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్ చేసి ఇంకా తెలంగాణ సెంటిమెంట్ ఏంది?. తెలంగాణ, ఆంధ్ర ఫీలింగ్ తీసుకొచ్చే కేసీఆర్ అండ్ టీం రెచ్చగొట్టే యత్నం చేస్తోంది.

## గులాబీ కండువాతో పోలింగ్ కేంద్రానికి వెళ్లిన ఎమ్మెల్యే

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు. బీఆర్ఎస్ కండువాతో పోలింగ్ కేంద్రానికి ఆయన వచ్చారు. నెన్నెల మండలం జెండా వెంకటపూర్‌లో ఎమ్మెల్యే ఓటు హక్కు వినియోగించుకున్నారు. దుర్గం చిన్నయ్య గులాబీ కండువాతో పోలింగ్ కేంద్రానికి వచ్చినా ఎన్నికల సిబ్బంది అభ్యంతరం చెప్పకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి.






## విద్యావంతులంతా తమ బాధ్యతను నిర్వర్తించాలి: కేటీఆర్

బంజారాహిల్స్‌లోని నందినగర్‌లో తన సతీమణి శైలిమతో కలిసి కేటీఆర్ ఓటు వేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లేవాళ్లకే ఓటు వేశానని తెలిపారు. 'ప్రజాస్వామ్యంలో ఇది పెద్ద పండుగ. నగర, పట్టణ ప్రాంతాల్లో ఓటర్లు పూర్తిస్థాయిలో ఓటింగ్‌కు రావడం లేదు. అందరూ బయటకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోండి. పట్టణాల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉండటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. విద్యావంతులంతా తమ బాధ్యతను నిర్వర్తించాలి. నా రాష్ట్రాన్ని ప్రగతిపథంలో ముందుకు తీసుకెళ్లే పార్టీకి ఓటు వేశాను" అని కేటీఆర్ చెప్పారు



## చింతమడకలో ఓటు వేసిన సీఎం కేసీఆర్

తెలంగాణ సీఎం కేసీఆర్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. సిద్దిపేట మండలం చింతమడకలోని పోలింగ్ కేంద్రానికి సతీసమేతంగా వచ్చిన ఆయన తన ఓటు వేశారు. ఉదయం నుంచి పోలింగ్ కేంద్రానికి రాని చింతమడక ఓటర్లు..కేసీఆర్ రాగానే భారీ సంఖ్యలో క్యూ కట్టారు. ఓటు వేసిన అనంతరం బయటకు వచ్చిన సీఎం ప్రజలకు అభివాదం చేశారు. అనంతరం కేసీఆర్ దంపతులు హైదరాబాద్ కు బయలదేరారు. కేసీఆర్ దంపతుల వెంట మంత్రి హరీష్ రావు కూడా ఉన్నారు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM













## ఓటు హక్కు వినియోగించుకుంటున్న

# సినీ, రాజకీయ ప్రముఖులు


తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ, సినీ ప్రముఖులు తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. అందులో భాగంగా హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లోని పోలింగ్ బూత్‌లో సినీనటుడు మెగాస్టార్ చిరంజీవి, ఆయన కుటుంబ సభ్యులతో వచ్చి ఓటు వేశారు.అంతకుముందు జూబ్లీహిల్స్ లో స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్, కీరవాణి, సుమంత్ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రతి ఒక్కరు ఓటు వినియోగించుకోవాలని సుమంత్ అన్నారు. హైదరాబాద్ లో ఓటింగ్ శాతం పెరగకపోవడం బాధకరమని చెప్పారు. అనంతరం హీరో ఎన్టీఆర్ కూడా తన కుటుంబంతో కలిసి వచ్చి ఆయన జూబ్లీహిల్స్ ఓబుల్‌రెడ్డి పబ్లిక్ స్కూల్‌లో ఓటు వేశారు. మాజీ క్రికెటర్, కాంగ్రెస్ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి మహ్మద్ అజారుద్దీన్ హైదరాబాద్‌లో ఓటు వేశారు. ఓటేయడమే ముఖ్యం.. ఓటే



యకుంటే ప్రశ్నించే హక్కు లేదని మాజీ క్రికెటర్, కాంగ్రెస్ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి మహ్మద్ అజహరుద్దీన్ అన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (CEO) వికాస్ రాజ్ S.R నగర్ లోని పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు. ఉదయం 7 గంటల నుండి తాము చాలా ప్రదేశాలలో కూడా పొడవైన క్యూలను చూస్తున్నామని, పోలింగ్ చురుగ్గా సాగుతోందని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన అభ్యర్థించారు. ఇక జూబ్లీహిల్స్ లో ఓటు వేసిన ఆస్కార్ అవార్డు గ్రహీత సంగీత స్వరకర్త పద్మశ్రీ ఎంఎం కీరవాణి.. ఈ రోజు సెలవు మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.








## తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో విషాదం..

# గుండెపోటుతో ఉద్యోగి మృతి!



తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వేళ విషాదం చోటు చేసుకుంది. ఎన్నికల విధుల్లో ఉన్న ఓ ఉద్యోగి గుండెపోటుతో మృతి చెందారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలో చోటుచేసుకుంది. ఇస్నాపూర్ గ్రామం (248) పోలింగ్ బూత్ విధుల్లో ఉన్న సుధాకర్ అనే వ్యక్తి బుధవారం రాత్రి గుండె పోటుతో కన్నుమూశారు. ఎన్నికల విధుల్లో భాగంగా సుధాకర్ బుధవారం మధ్యాహ్నం ఇస్నాపూర్ గ్రామంకు చేరుకున్నారు. రాత్రి అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో.. అతడికి తోటి ఉద్యోగులు సీపీఆర్ చేసినా ఫలితం లేకుండా పోయింది. ఎన్నికల అధికారులు ఉదయం కుటుంబ సభ్యులను పిలిపించి మృతదేహాన్ని అప్పగించారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ వెటర్నరీ విభాగంలో సుధాకర్ సహాయకుడిగా పని చేస్తున్నారు.

## నాగార్జున సాగర్

# ప్రాజెక్టు వద్ద హైటెన్షన్..

నల్లగొండ జిల్లాలోని నాగార్జున సాగర్ ప్రాజెక్టు వద్ద హైటెన్షన్ వాతావరణం నెలకొంది. 26 గేట్లలో చెరి 13 గేట్ల దగ్గర పోలీసుల పహారా కొనసాగుతుంది. ముళ్ల కంచె, టెంట్లు వేసుకుని పోలీసులు బందోబస్తు చేస్తున్నారు.ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం వైపు వాహనాలు రాకుండా ఏపీ పోలీసులు అడ్డుకుంటున్నారు. తాత్కాలిక విద్యుత్ తో కుడి కాల్వకు నీటిని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధికారులు విడుదల చేసుకున్నారు. ఇక, 5వ గేటు ద్వారా గంటకు 500 క్యూసెక్కుల చొప్పున నీటి విడుదల కొనసాగుతుంది. ఇదే పరిస్థితి కొనసాగితే రెండు రోజుల్లో డెడ్ స్టోరేజ్ కు నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ చేరుకోనుంది. దీంతో నాగార్జు సాగర్ డ్యామ్ దగ్గర మీడియాపై పోలీసులు ఆంక్షలు విధించారు.

